క్లుప్తంగా

హక్కుల కోసం పోరాటం

టేకుమట్ల: బహుజన రాజ్యాధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..అధికార, ప్రతిపక్ష నాయకుల్లో అగ్ర కులాలకు చెందిన వారు స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలను పావులుగా వాడుకుంటున్నారని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలను ఆదర్శంగా తీసుకుని మన హక్కుల కోసం, రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలన్నారు. ఇప్పటికైనా అత్యధిక ఓటర్లు గల మనం అగ్రకుల నాయకుల కోసం కాకుండా మన కోసం, మన రాజ్యాధికారం కోసం పని చేస్తే మనమే రాజ్యాధికారులం అవుతామని అన్నారు.

పరామర్శ



చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సివిల్ సప్లై హమాలీ కార్మికుడు ఆరెపల్లి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.రాములు, కార్యాలయ సూపరింటెండెంట్ గంగాధర రాజు గురువారం పరామర్శించారు. కార్మికులు సురేష్, కుమార్, నాగరాజు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఏటూరునాగారం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తాజొద్దీన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు తరలింపు



ఏటూరునాగారం : మండల పరిధిలో 120 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించగా వారిలో 40 మందికి సర్జరీ అవసరం కావడంతో హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రులకు ప్రత్యేక వాహనంలో గురువారం తరలించారు. సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల ప్రభాకర్, గౌరవ సలహాదారు చిటమట రఘు, కోశాధికారి వెంకట్రావ్, కార్యదర్శి బచ్చు సతీష్, అర్చకులు భాను ప్రకాశ్ శర్మ, అటిక సతీష్, కల్యాణి తదితరులు ఉన్నారు.

సన్మానం

ఏటూరునాగారం : మండలంలోని పాప్కపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన సబిహ బదిలీ కాగా ఉపాధ్యాయులు గురువారం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య, ఉపాధ్యాయులు నర్సింగరావు, కుమారి, సమ్మక్క, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

‘ఆదర్శ’లో ప్రవేశాలకు వేళాయె..

మోడల్ స్కూళ్లో 6 నుంచి 10వ తరగతుల వరకు ప్రవేశాలకు దరఖాస్తులు

- ఈనెల 28 వరకు అవకాశం
- ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష

మొగుళ్లపల్లి: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొగుళ్లపల్లి, చిట్యాల, కాటారం, గణపురం, మహాముత్తారం, మల్హర్ మండలాల్లో ఈ పాఠశాలలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించేందుకు ఈ పాఠశాలలు దోహదపడుతోన్నాయి. కాగా 2025–26 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలుబడింది.

సీట్ల కేటాయింపు ఇలా.. .

జిల్లాలోని ఆరు పాఠశాలలకు కలిపి 6వ తరగతిలో మొత్తం 6 వందల మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. దీంతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిలో నిర్వహిస్తారు. సీట్లల్లో ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు ఆరు శాతం, బీసీ విద్యార్థులకు 29 శాతం (బీసీ ఏ–7) (బీసీ బీ–10) (బీసీ సీ–1)(బీసీ డీ–7)(బీసీ ఈ–4), ఓపెన్ కేటగిరీలో 50 సీట్లను భర్తీ చేయనున్నారు. అన్ని కేటగిరీలోనూ బాలికలకు 33 శాతం, దివ్యాంగులకు 3 శాతం కేటాయించనున్నారు.



కొర్మిశాలలోని మోడల్‌స్కూల్

ఆన్‌లైన్ దరఖాస్తు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్ ఫొటో, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలు ఏ పాఠశాల ప్రవేశం కోసం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాలలో అందజేయాలి.

ప్రవేశ పరీక్ష విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఉంటాయి.

ఈనెల 28 తుది గడువు

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం జనరల్ కేటగిరి విద్యార్థులకు రూ.200, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించాలి ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది.

మోడల్ స్కూల్ ప్రత్యేకతలు..

- ఎటువంటి రుసుం లేకుండా ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా బోధన
- పక్కా భవనంతో తరగతి గదులు
- నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం
- ఉచితంగా పుస్తకాల అందజేత
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు

స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం



ఆదర్శ పాఠశాలో ఆరో తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు, ఏడు నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. స్థానిక విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–తాళ్లపెల్లి రాకేశ్, మోడల్ స్కూల్, కొర్మిశాల

సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న వెంకటప్ప

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్క తిరుపతి, ప్రధాన కార్యదర్శి కొత్త కుమారస్వామి నాయకులు మార్త రాజేందర్, వేల్పుల రాజు, రఘుపాల్, శ్రీనివాస్, రఫీ, కోటిలింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అదనపు రుసుం తీసుకుంటే చర్యలు

- ఈడీఎం శ్రీకాంత్

మొగుళ్లపల్లి: మీ సేవా కేంద్రాల వద్ద నిర్దేశించిన రుసుం కంటే అదనంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని ఈడీఎం శ్రీకాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మీసేవలో సేవ కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. మరింత మెరుగైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందించు సేవలకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.



చిట్యాల: మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం శ్రీకాంత్

చిట్యాల: మండలంలోని మీ సేవ కేంద్రాన్ని ఈడీఎం శ్రీకాంత్ గురువారం తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజలకు అంతరాయం కలుగకుండా సేవలు అందించాలని తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ



లారీ వేబిల్లును పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

మల్హర్: మండలంలోని వల్లెకుంట క్రాస్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద మంథని–కాటారం వైపు వెళ్తున్న ఇసుక లారీలను కొయ్యూరు ఎస్సై నరేశ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లారీల వేబిల్లు, వాహన పత్రాలను, ఇసుక లోడ్‌ను పరిశీలించారు. ఈ చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు నిఘా ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మార్చి 18న భూమి బహిరంగ వేలం

- రైతుకు నోటీసులు అందజేసిన బ్యాంకు అధికారులు

రేగొండ: మండలంలోని చిన్నకోడెపాక(బాలయ్యపల్లి)కి చెందిన తొట్ల రాజయ్యకు చెందిన భూమిని మార్చి 18న బహిరంగ వేలం వేస్తున్నట్లు డీసీసీబీ పరకాల ఏజీఎం స్రవంతి గురువారం తెలిపారు. ఈమేరకు గురువారం రైతు రాజయ్యకు ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలయ్యపల్లి గ్రామానికి చెందిన తొట్ల రాజయ్య 2020లో 4ఎకరాల 13 గుంటల వ్యవసాయ భూమిని బ్యాంకుకు తనాఖా పెట్టి రూ.4లక్షల 69వేల రుణం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నదగును 5 సంవత్సరాలలో 10 వాయిదాలలో చెల్లించేలా వీలునామా ఉండగా, ఇప్పటి వరకు ఒక్క వాయిదాను కూడా చెల్లించలేదన్నారు. రుణం చెల్లించాలంటూ లీగల్ నోటీసులను జారీ చేసినా సమాధానం లేకపోవడంతో 1904 చట్ట ప్రకారం తనాఖా పెట్టిన రైతు భూమిని బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజయ్యకు నోటీసులను అందించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.



నోటీస్‌ను రైతుకు అందిస్తున్న బ్యాంకు అధికారులు

మతోన్మాద కుట్రలను ప్రతిఘటించాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

భూపాలపల్లి రూరల్: దేశాన్ని మతోన్మాద హింస వైపు నడిపించడానికి మతోన్మాద శక్తులు చేస్తున్న కుట్రలను ప్రతిఘటించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో గురువారం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి నాయకుడు రాసపెల్లి భద్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. హిందూ ధర్మం పేరుతో బహిరంగంగా దాడులు చేయటం ఒక సంస్కృతిగా మారిందని వాపోయారు. ఉన్మాదం తలకెక్కిన వ్యక్తులు అనేక మంది ఉన్నారని అలాంటి వారిని పౌర సమాజం ఏరివేయాలని కోరారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జాతీయ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందునూరి రాజరత్నం, జాతీయ సమితి సభ్యురాలు పానగంటి లావణ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల జోసెఫ్, జిల్లా సహాయ కార్యదర్శి పెద్దమామల సంధ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు, కమలాకర్, సింహాద్రి, పద్మ, స్వప్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

బస్సును ఢీకొట్టిన లారీ..

- పలువురికి గాయాలు

కాటారం: మండలంలోని శివారులోని కమలాపూర్ క్రాస్ సమీపంలో గల అటవీ ప్రాంతంలో గురువారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్ర యాణికులతో కాటారం వైపుగా వెళ్తుంది. కాటారం వైపు నుంచి వస్తున్న లారీ బస్సును ఢీ కొట్టడంతో కాటారానికి చెందిన బెడిక మల్లయ్య, బుచ్చిమల్లు, మరి కొంతమంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన మల్లయ్య

ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్ చేయాలి

- రికార్డు వెరిఫికేషన్ అధికారి ప్రసాద్

టేకుమట్ల: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకనం ఇంటర్నల్ మార్కులను ఉపాధ్యాయులు ఆన్‌లైన్ చేయాలని రికార్డు వెరిఫికేషన్ అధికారి కొట్టె ప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా తెలుగు, హిందీ, ఆంగ్లం, గణిత, సామాన్య, సాంఘిక శాస్త్ర మూల్యాంకాలల్లో ఈ నెల 21 నుంచి 27 వరకు 20 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియలో ఏదైన సమస్య తలెత్తుతే సమాచారం అందించాలన్నారు. అలాగే విద్యార్థులను పదో తరగతి వార్షిక పరీక్షలకు మానసికంగా సిద్ధం చేయాలని, భయం, ఆందోళన చెందకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు అశోక్, రవీందర్, ప్రకాశ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

అనుమానితులను గూడెంలోకి రానివ్వొద్దు

ఎస్ఎస్ తాడ్వాయి: అనుమానితులను గూడెంలోకి రానివ్వొద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా గూడెంలోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గొత్తికోయలకు సూచించారు. గురువారం మండలంలోని కొశెట్టివాయి గ్రామం, గొత్తికోయగూడెంలో సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. మారుమాల ప్రాంతంలో ఉన్నందున కొత్త వ్యక్తులు సంచరించే అవకాశం ఉంటుందని, ఎవరైనా గ్రామంలోని కొత్తగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దని హెచ్చరించారు. సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని సూరవీడు సమీపంలో ఇసుక లారీ రోడ్డుపై గురువారం దిగబడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా లారీలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా ఆర్‌అండ్‌బీ అధికారులు బీటీరోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతోనే రోడ్డంతా గుంతలమయంగా మారిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై లారీలు దిగబడుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వనదేవతలకు మొక్కులు



కన్నాయిగూడెం: సర్వాయి అడవినుంచి వనాన్ని తీసుకువస్తున్న పూజారులు



కన్నాయిగూడెం: శివసత్తుల పూనకాలతో సాగుతున్న జాతర

కాటారం: మహాముత్తారం మండలం బోర్లగూడెంలో గురువారం వన దేవతలు సమ్మక్క–సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సమ్మక్క సారలమ్మల గద్దెలను అలంకరించి పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా కంకవనం నుంచి కంక చెట్లు తీసుకొచ్చి అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు. భక్తుల రాకతో బోర్లగూడెం సందడిగా మారింది.

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెంలో గురువారం సమ్మక్క వనం నుంచి జనంలోకి చేరడంతో వనదేవతల జాతర ఘనంగా సాగింది. బుధవారం సారలమ్మ రాకతో ప్రారంభమైన జాతర రెండో రోజు సర్వాయి ప్రాంతంలోని దట్టమైన అడవిలో గల దేవర గుట్ట నుంచి సమ్మక్కను సర్వాయి గ్రామానికి చెందిన ఆదివాసీలు, పూజారులు మోహన్‌రావు, లక్ష్మణ్ రావు, పులిశ గోవిందు, దామోదర్, గంగరాజు, కోరం రాజు, దేవర బాలలు, సునార్కని సత్యం, సుధాకర్ వన దేవతను తీసుకు వచ్చి వనదేవతలను గద్దెపై ప్రతిష్ఠించారు.

సమ్మక్క వనం నుంచి జనంలోకి..

సర్వాయి ప్రాంతంలోని అడవిలో గల దేవర గుట్ట నుంచి పూజారులు, వడ్డెలంతా రహస్య పూజలు చేసి తల్లికి మొక్కులు చెల్లించి దేవర బాలలు సత్యం, సుధాకర్ తీసుకోని వచ్చారు. గురువారం ఉదయం పూజారులు, వడ్డెలు ఆదివాసీ సాంప్రదాయాలతో దట్టమైన సర్వాయి అడవిలో వెదురు వనంను (కంక వనం) భక్తి శ్రద్ధలతో పూజించి డోలీ వాయిద్యాలు, నృత్యాల నడుమ తీసుకోని వచ్చి బుట్టాయిగూడెంలోని సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించి రహస్య పూజలు చేశారు.

తల్లికి అడారాలు అప్పగింత..

వన దేవత సమ్మక్కకు పూజారులు దేవర రాకకు ముందు పూజలు చేసి అడారాలను తీసుకొచ్చి సమ్మక్క గుడిలో పూజలు చేశారు. అడారాల్లో తల్లులకు నైవేద్యాలు పెడతారు.

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని బీసీ మర్రిగూడెంలో సమ్మక్క, సారలమ్మ జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మల్లాపురం గుట్టల నుంచి వన దేవతను గద్దెకు తీసుకు వచ్చారు. అనంతరం సమ్మక్క–సారలమ్మలను డోలీ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు జగదాంబ సెంటర్,అంబేడ్కర్ సెంటర్ మీదుగా వేప చెట్టు సెంటర్, బీసీ మర్రిగూడెం వరకు సాగింది.



వెంకటాపురం(కె): కంకవనాన్ని గద్దెకు తీసుకువస్తున్న పూజారులు

ఆరు కిలోమీటర్లు.. ఆపేశారు!

నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు

- మంత్రి సీతక్క ఆదేశాలు బేఖాతరు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని కొడిశెల గ్రామం నుంచి లింగాల వరకు ఆరు కిలోమీటర్ల మేర బీటీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. మేడారం మహాజాతరకు ముందు కొడిశెల వరకు బీటీ నిర్మాణం పనులు చేపట్టారు. అనంతరం కొడిశెల నుంచి లింగాల వరకు కంకర వేసి బీటీ వేయకుండానే పనులను నిలిపివేశారు. పస్రా నుంచి కొడిశెల వరకు ఈ రోడ్డుగుండా వెళ్లే వాహనదారులకు ప్రయాణం సాఫీగా సాగిన కొడిశెల నుంచి లింగాల వరకు ఆరు కిలోమీటర్లు మాత్రం నరకప్రాయంగా మారింది. రోడ్డుపై రెండు వాహనాలు ఒకేసారి వెళ్లే సమయంలో ఎదురెదురుగా వచ్చే దుమ్ము ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 18కి.మీ ప్రయాణం ఒక ఎత్తయితే, 6 కి.మీల ప్రయాణం గంటకు పైగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

ద్విచక్ర వాహనదారులకు తిప్పలు

ఆరు కిలోమీటర్ల కంకర రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. పెద్ద వాహనాలు ఎదురైతే బైక్ పై వెళ్లే ప్రయాణికుల కళ్లలో దుమ్ము పడి అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు. ప్రయాణికులు భయపడుతున్నారు. అలాగే అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఆరు కిలోమీటర్ల బీటీ నిర్మాణం చేపట్టాలని గిరిజనులు ఆర్‌అండ్‌బీ అధికారులతో విన్నవించుకున్న ఫలితం లేదు.

అధికారులను మందలించిన మంత్రి

నెల రోజుల క్రితం మంత్రి సీతక్క బంధాల గ్రామ పంచాయతీ పరిధిలోని కోశాపూర్, కొడిశెల రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన సమయంలో ఈ దారి గుండా కాన్వాయ్ వెళ్లారు. అదే సమయంలో కాన్వాయ్ కనపడనంతగా దుమ్ము ధూళి లేవడాన్ని గమనించిన సీతక్క ఈ రోడ్డు పనుల గురించి సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను మందలించారు. ఆరు కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులు ఎందుకు ఆగిపోయాయని ఆర్‌అండ్‌బీ ఈఈని సీతక్క ప్రశ్నించగా, కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో పనులు ఆగిపోయిందని సమాధానం ఇచ్చారు. కారణాలు చెప్పొద్దని వెంటనే రోడ్డుపై బీటీ వేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు పనులు చేసిన దాఖలాలు లేవు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ రవిని వివరణ కోరగా త్వరలోనే బీటీ నిర్మాణ పనులను చేపడతామన్నారు. బీటీ వేసేందుకు కాంట్రాక్టర్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు.



బీటీ వేయకపోవడంతో కంకర తేలిన రోడ్డు

ఆదమరిస్తే.. అంతే సంగతి

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని గంగారం పంచాయతీ పరిధి బంజర ఎల్లాపూర్ సమీపంలో రోడ్డుపై చెట్టు పూర్తిగా తొలగించకుండా కేవలం కొమ్మలను తొలగించారు. దీంతో వచ్చి,పోయే భారీ వాహనాలకు పెను ప్రమాదం పొంచి ఉంది. తాడ్వాయి నుంచి కాటాపూర్ మీదుగా మణుగూరు, బయ్యారం వరకు నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. డీసీఎంలు, లారీలు, బస్సులు వెళ్లే సమయంలో ఏదైనా వాహనం ఆదమరిచి రోడ్డు దిగితే చెట్టు తగిలి ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చెట్టును పూర్తిగా తొలగించాలని వాహనదారులు. ప్రయాణికులు కోరుతున్నారు.

